మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 54
పేజీలు : 3
శుక్రవారం
12.09.2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గందరగోళం

### ఇంకా పెండింగ్‌లోనే రాజ్‌భవన్

**టి మీడియా, సెప్టెంబర్ 11,హైదరాబాద్ బ్యూరో:**




తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు అమోదం లభించిందంటూ వార్తలు వెలువడ్డాయి.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వార్తపై రాజ్‌భవన్ అధికారులు స్పందించారు. ఈ వార్త అవాస్తమని గవర్నర్ బంగ్లా అధికారులు తెలిపారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు ఇంకా పెండింగ్‌లోనే ఉందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ.. జారీ చేసిన మెమోతో ఈ గందరగోళం నెలకొందని వివరించారు.ఇదిలావుంటే, తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లకు రాష్ట్ర గవర్నర్ లైన్ క్లియర్ అయ్యిందని.. సోషల్ మీడియాలో ప్రచారం అయ్యింది. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు, 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంటున్నట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ మేరకు స్పందించిన రాజ్‌భవన్ అధికారులు ఇదంతా అవాస్తవమని తేల్చి చెప్పారు.

## బోర్డు తిప్పిన

# "రియల్" వాసవి




- ప్రచారకర్తగా విక్టరి వెంకటేశ్
- ఫ్లాట్ల కోసం పాట్లు
- తిరగబడ్డ కొనుగోలుదారులు
- కొరడా ఝుళిపించిన రేరా





**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో:**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూప్‌పై కొనుగోలుదారులు తిరగబడ్డారు. వాసవి గ్రూపు ప్రచారకర్తగా టాలీవుడ్ హీరో వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో వెంకటేశ్‌తో కలిసి వాసవి గ్రూపు సీఎండీ ఎర్రం విజయ్‌కుమార్‌లు కొంపల్లిలో నూతనంగా ప్రారంభించిన వాసవి భువి, వాసవి ఆవాస ప్రాజెక్టులకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అంతా మోసం అని తేలిపోయింది. డబ్బులు మొత్తం చెల్లించిన తర్వాత ప్లాట్లను అప్పగించకపోవడంతో ఆగ్రహానికి లోనయ్యారు. ఆ కంపెనీ చేతిలో ఇరుక్కుపోయిన వందలాది మంది కొనుగోలుదారులు బంజారాహిల్స్‌లోని రోడ్ నం. 12 కార్పొరేట్ కార్యాలయాన్ని మార్చి లో ముట్టడించారు ముట్టడించారు. కస్టమర్ల తిరుగుబాటుతో వాసవి యాజమాన్యం నిర్ఘాంత పోయింది. ఆందోళనకు దిగిన కొనుగోలుదారులను కార్యాలయంలో చర్చలు జరిపి.. శాంతింపజేయడంతో తమకు మరో గడువిచ్చి, ఆ లోగా ప్లాట్లను అందజేస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. అయితే కార్యాలయాన్ని చుట్టుముట్టిన నేపథ్యంలో.. వాసవి గ్రూప్ ఈ అంశాన్ని బయటకు రాకుండా విశ్వప్రయత్నాలు చేసింది. కొనుగోలుదారులను లోపలికి అనుమతించి, ప్రధాన ద్వారాలు మూసివేసింది.దు నెలలు గడువు ముగిసినా.. తమ ఫ్లాట్లను అప్పగించలేదు.తప్పుడు హామీలతో బయ్యర్లను ఆకట్టుకొని వారి నుంచి 81 శాతం ముందే డబ్బులు కట్టించి తీరా సమయానికి వారికి ఫ్లాట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వారిని రోడ్డున పడేసింది. కోట్లాది రూపాయలు పెట్టిన బయ్యర్లంతా ఏకమై వాసవి గ్రూప్ నిర్వాహకుల మోసాలపై రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. నిర్వాహకులు ఎంతకు దిగి రాకపోవడంతో రెరా(తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ రెరా)ను ఆశ్రయించారు.

### గట్టి షాక్‌నిచ్చిన రెరా

హైదరాబాద్‌లోని హాఫీజ్‌పేట మంజీరా పైపులైన్ రోడ్డులో లేక్ సిటీ- వెస్ట్ పేరిట ప్రాజెక్ట్(రెరానంబరు %ా%0 2500 001819) ను 2020లో అనుమతులు తీసుకున్నారు. సెల్లార్ంగ్రౌండ్ం14 ఫ్లోర్లతో ఏడు టవర్ల నిర్మాణం జరుగుతున్నది. ఇందులో 2, 3 బీహెచ్‌కే ఫ్లాట్‌లు ఉన్నాయి. తొలుత 2023 ఆగస్టు నాటికి ఫ్లాట్లు అందజేస్తామని వాసవి గ్రూప్ కొనుగోలుదారులతో ఒప్పందం కుదుర్చుకున్నది.ఆరు నెలల గ్రేస్ పీరియడ్‌తో కలిపి గరిష్ఠంగా గతేడాది ఫిబ్రవరిలో హ్యాండోవర్ చేయాలని నిబంధన ఉంది. కానీ ఇప్పటికీ (సెప్టెంబర్ 2025) ప్రాజెక్ట్ 60- 70% మాత్రమే పూర్తి కాగా, ఫ్లాట్ల హ్యాండోవర్ జరగలేదని రెరా గుర్తించింది. కొనుగోలుదారులు ఇప్పటికే ఫ్లాట్ ధరలో 81% వరకు చెల్లించినా వాసవి నిర్వాహకులు కేవలం తప్పుడు హామీలు, వాయిదా మాటలు మాత్రమే చెబుతూ వినియోగదారులను మోసగించినట్లుగా తేలింది. ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేయడం వల్ల కొనుగోలు చేసిన వారికి ఆర్థిక భారం, మానసిక ఒత్తిళ్లకు గురిచేసిన వాసవి తీరును సీరియస్‌గా తీసుకున్న రెరా.. కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తంపై ప్రతి సంవత్సరం 10.85% వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది.




### హైడ్రా చర్యలు

వాసవి గ్రూప్ చేపడుతున్న ప్రాజెక్టుల్లో ఒక్కో చోట ఒక్కో రీతిలో అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కాగితాల్లో చెప్పేదొకటి క్షేత్రస్థాయిలోచేసేదొకటి అన్నట్లు అంతులేకుండా ఆక్రమాలకు పాల్పడుతున్నది. కొనుగోలుదారులే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్టులను చేపడుతున్నది. హాఫీజ్‌పేట లేక్ సిటీ -వెస్ట్ ప్రాజెక్టులో కొనుగోలుదారులను మోసం చేస్తే కూకట్‌పల్లి ఖైత్లాపూర్‌లో వాసవీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణాలపై హైడ్రా సీరియస్‌గా వ్యవహరించింది.భరత్‌నగర్-ఖైత్లాపూర్ మార్గంలోని కాముని చెరువు-మైసమ్మ చెరువులను కలుపుతూ సాగే వరద కాలువను కబ్జా చేసిన వాసవి నిర్మాణ సంస్థపై హైడ్రా కేసు నమోదు చేసింది. 17 మీటర్ల వెడల్పుతో పాటు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్ జోన్ వదలకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి అక్రమాలను గుర్తించారు. హైడ్రా సూచన మేరకు ఇరిగేషన్ శాఖ కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసింది. కొంతమేర ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌తో నిర్మించిన కాలువ మధ్యలో స్లాబ్ వేసేందుకు ఉద్దేశించిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.

వాసవీ వెంచర్స్ 1994లో హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభమైన వాసవీ గ్రూప్ గత 27 సంవత్సరాల్లో 47 ప్రాజెక్టులు పూర్తి చేసింది.బాచుపల్లిలో వాసవి అర్బన్, ఉప్పల్?లో వాసవి మెట్రో పోలీసు, హాఫీజ్‌పేట్?లో వాసవీ లేక్ సిటీ, ఎల్బీ నగర్?లో వాసవీ శ్రీ నిలయం, గచ్చిబౌలి సర్కిల్?లో వాసవీ స్కై సిటీ, గచ్చిబౌలి విప్రో సర్కిల్ దగ్గర వాటర్ ఫ్రంట్, అమీర్?పేట్?లో సోలిటైర్ హైట్స్, శామీర్ పేట్?లో వాసవీ గ్రీన్ లీఫ్, నార్సింగిలో వాసవీ అట్లాంటిస్, సుచిత్ర వద్ద వాసవీ టీఎన్?ఆర్, ఆర్ ఆర్ పీ సిల్వర్ ఓక్, సుచిత్ర సర్కిల్ వద్ద టీఎన్ఆర్ వాసవీ నార్త్ ట్రేడ్ సెంటర్, హైటెక్ సిటీ సమీపంలో వాసవీ స్కైలా, సుచిత్ర సమీపంలో వాసవీ నందనం పేరుతో ప్రీమియం లైఫ్ స్టైల్ అపార్ట్మెంట్స్, ఎల్బీ నగర్‌లో వాసవీ ఆనంద నిలయం, మూసాపేట్‌లో వాసవీ సరోవర్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

## రాగల ఐదురోజులు భారీ వర్షాలు

### జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో:**



తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయనిహైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో.. ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ నారాయణపేట, వపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. సోమవారం కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గడిచిన 24గంటల్లో రాష్ట్వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, ములుగు, భూపాలపల్లి, రంగారెడ్డి, కొత్తగూడెం, జోగులాంబ గద్వాల జిల్లా సహా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 13.2, ములుగు జిల్లాల్లోని మేడారంలో 13.9 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## మరోసారి భారీ ఎన్‌కౌంటర్

### 10మంది నక్సల్స్ మృతి

**టి మీడియా, సెప్టెంబర్ 11, రాయ్‌పూర్:**



ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకీ తూటాలు మోగాయి. గరియాబంద్ ప్రాంతంలో గురువారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇప్పటి వరకు పది మంది మృతి చెందిఉండవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా ధ్రువీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గరియాబంద్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని.. ఎన్‌కౌంటర్‌లో కొందరు మావోయిస్టులు చనిపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. ఘటనా ప్రాంతంలో ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్న ఆయన తెలిపారు.ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలోని ఐఈడీ పేలి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. మందుపాతరలను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ సమయంలో ఈ పేలుడు సంభవించినట్టు దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ తెలిపారు. గాయపడిన ఇద్దరు జవాన్లలో ఒక ఇన్‌స్పెక్టర్ కూడా ఇన్నటు ఆయన పేర్కొన్నారు. గాయపడిన ఇద్దరు ప్రతస్తుం దంతేవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. మెరుగైన వైద్య సంరక్షణ కోసం వారిని రాయ్‌పూర్‌కు హెలికాప్టర్ ద్వారా తరలించనున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గరియాబాద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10మంది నక్సల్స్ మృతి చెందారు. వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోదెం బాలకృష్ణ, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు సహా కీలక సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. గురువారం మధ్యాహ్నం మావోయిస్టులు తారసపడ్డారు. బలగాలను చూడగానే మావోయిస్టులు కాల్పులకు దిగారు. వెంటనే అప్రమత్తమైన భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో పదిమంది మావోయిస్టులను బలగాలు హతమార్చాయి. మృతుల్లో మనోజ్‌తో పాటు ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద సంఖ్యలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గరియాబంద్ ఈ30, స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్?టీఎఫ్), కోబ్రా, రాష్ట్ర పోలీసులు ఈ ఆపరేషన్?లో పాల్గొన్నట్లు ఐజీపీ తెలిపారు. అయితే భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎదురు కాల్పులు ముగిసిన తర్వాతే మృతులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోందిఈ ఎన్‌కౌంటర్‌లో వరంగల్ ఘన్‌పూర్‌కు చెందిన మనోజ్ మృతి చెందినట్లు బలాగాలు గుర్తించాయి. మనోజ్?ను బాలన్న, రామచందర్, భాస్కర్? అనే పలు పేర్లతో పిలుస్తారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న మనోజ్‌పై రూ.2 కోట్ల వరకు రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మనోజ్ చురుకుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర కమిటీలో కీలక సభ్యుడైన మనోజ్ మృతి మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

# రైస్ మిల్లుల టోకరా

- ప్రభుత్వానికి చేరని సీఎంఆర్ కోటా
- 12తో గడువు ముగింపు
- 1.27 లక్షల మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో

**టి మీడియా, సెప్టెంబర్ 11వనపర్తి బ్యూరో :**

జిల్లాలో సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి గడువు పెంచి అవకాశం ఇచ్చినా.. పెండింగ్ పూర్తి కాలేదు. చివరకు రెండోసారి అవకాశం ఇచ్చిన గడువు కూడా రేపటితో ముగియనున్నది.ఇప్పటికే 2024-25కు సంబంధించి వానకాలం, యాసంగిలో ఇంకా లక్షా 27 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. గడిచిన మూడు, నాలుగేండ్ల నుంచి జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు అందినకాడికి ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పని చేసిన అధికారులు.. అవినీతికి కేరాఫ్‌గా నిలిచి మిల్లర్లతో చేతులు కలపడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం కొల్లగొట్టినట్లు తెలిసింది.

### జిల్లాలో క్రమపద్ధతిలో కొనసాగని వ్యవహారం

వనపర్తి జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొనసాగే ధాన్యం వ్యవహారం క్రమ పద్ధతిలో కొనసాగడం లే దు. దీనికి సంబంధించిన నియమ నిబంధనలు అయిన వారికి ఒకలా.. కాని వారికి మరోలా కొనసాగుతున్నాయి. వడ్ల కేటాయింపులు మొదలుకొని తిరిగి బియ్యం లేవి పెట్టడం వరకు అనేక రకాల వ్యవహారాలు పౌరసరఫరాల శాఖలో రాజ్యమేలుతున్నాయి. ప్రస్తుతం 2024-25కు సంబంధించి వానకాలంలో 1.43.149 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 57 రైస్ మిల్లులకు కేటాయించారు. యాసంగిలోనూ 2.66.084 మెట్రిక్ టన్నులు వరి కొనుగోలు చేయగా, 77 రైస్‌మిల్లులకు కేటాయించారు. కాగా, జిల్లాలో 180 మిల్లులు ఉండగా వీటిలో అర్హత ఉన్న వాటికి మాత్రమే కేటాయింపులు చేశామని చెబుతున్నా.. ఇది వాస్తవం కాదన్న గుసగుసలున్నాయి.

### వానకాలం 96 వేల టన్నులకు..

వానకాలం సీజన్‌కు సంబంధించి వడ్లను కేటాయించిన మిల్లుల నుంచి 96,166 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందాల్సి ఉన్నది. వీటిలో ఇప్పటి వరకు 69, 646 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే లేవి పెట్టారు. ఇంకా ఖరీఫ్‌కు సంబంధించి 27,209 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది. అలాగే యాసంగి పరంగా చూస్తే.. 2 లక్షల 34,398 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించారు. ఇందుకు లక్షా 57,796 మెట్రిక్ టన్నుల బియ్యం లేవి పెట్టాలి. వీటిలో ఇప్పటి వరకు కేవలం 69,646 టన్నులు మాత్రమే మిల్లర్లు సర్కారుకు ఇవ్వగా, లక్షా 7,292 మెట్రిక్ టన్నులు పెండింగ్ ఉంది. ఇలా రెండు సీజన్లకు కలిపి లక్షా 27 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందాల్సి ఉంది.



### ఏటా ఎందుకు పెండింగ్..

ప్రభుత్వానికి పెట్టాల్సిన సీఎంఆర్ ఇలా ప్రతి ఏటా ఎందుకు పెండింగ్ పడుతుందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇది ప్రతి సంవత్సరం కొనసాగే తంతుగా కనిపిస్తుంది. తప్పులు చేసేదాకా చూస్తూ ఉండే అధికారులు కంటితుడుపుగా చర్యలు తీసుకోవడంతో ఏడాదికేడాది సీఎంఆర్‌ను బకాయి పడే రైస్ మిల్లర్ల సంఖ్య పెరుగుతున్నది. జిల్లాలోని పలువురు మిల్లర్లు వారికి కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఇలా జిల్లాలో మూడు నుంచి నాలుగు సీజన్ల వరకు బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లున్నారు. అనేక దఫాలు గడువులిచ్చినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. ఈ పరిస్థితిలో ఇలా బకాయిపడ్డ మిల్లులకు ధాన్యం కేటాయించకూడదని నిబంధనలున్నా.. అంతా తూచ్ అన్నట్లుగానే సాగుతున్నది. చిన్న చేపను.. పెద్ద చేప మింగినట్లుగా కేవలం చిన్న యజమానులపైనే చర్యలన్నట్లుగా ఉంది. ఈ ఏడాది కూడా గతంలో బకాయిలున్న వారికి ధాన్యం కేటాయింపులు ఇవ్వకూడదని నిబంధనలున్నా.. వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు లేకపోలేదు. కాగా, మిల్లర్స్ అసోసియేషన్లు అయిన వారికే ఆసరా అన్నట్లు కూడా ఉన్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.

### రెండో గడువు ముగుస్తున్నా..

2024-25 వానకాలంలో జరిగిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన గడువును రెండో దఫా పొడిగించింది. మొదటి గడువుగా మే 31ని నిర్ణయించగా మిల్లర్లు చాలా వరకు లేవి పెండింగ్‌లో ఉంచారు. దీనిపై రెండో దఫాలో సెప్టెంబర్ 12 వరకు మిల్లర్లకు గడువు పొడగిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయినా ఇంకా మిల్లర్లు ప్రభుత్వానికి లేవి క్లియర్ చేయకుండా పెండింగ్‌లోనే ఉంచారు. ఇలా గడువులు విధించడం మామూలే అన్నట్లుగా వ్యవహారం కొనసాగుతున్నది. మిల్లులో జరిగే తతంగం అధికారులకు తెలుసు.. అధికారుల సంగతి మిల్లర్లకు తెలుసు అన్నట్లుగా రైస్ మిల్లర్ల లేవి వ్యవహారం జిల్లాలో ఓతంతుగా సాగుతున్నది. గడచిన మూడు, నాలుగేండ్లలో ఇక్కడి సీఎంఆర్‌కు సంబంధించిన వ్యవహారం రాష్ట్ర స్థాయిలో అవినీతి పరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే.

# సోషల్ మీడియాలో పోస్టులు

- కేసులు ముందు ప్రాథమిక విచారణ
- క్రిమినల్ చర్యలకు సరిపోదని హైకోర్టు స్పష్టీకరణ

**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో:**

సామాజిక మాధ్యమాల్లోని పోస్టులకు సంబంధించిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసే ముందు ప్రాథమిక విచారణ చేపట్టాలని హైకోర్టు తేల్చి చెప్పింది. విమర్శనాత్మక అంశాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారన్న కారణం క్రిమినల్ చర్యలు కొనసాగించడానికి సరిపోదని తెలిపింది. పరువు నష్టం, ద్వేషపూరిత ప్రసంగం హింసను ప్రేరేపించి, సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించేదిగా ఆరోపణలను నిరూపిస్తే విచారణను కొనసాగించవచ్చని తెలిపింది. చట్టబద్ధమైన అంశాలు లేకుండా కేవలం రాజకీయ విమర్శ ఎంత ఘాటుగా ఉన్నప్పటికీ, నేరారోపణ పరిధిలోకి రాదని స్పష్టం చేసింది.నమోదైన 3 కేసులను కొట్టివేయాలంటూ : కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారంటూ అందిన ఫిర్యాదుల మేరకు రామగుండం, కరీంనగర్ పోలీసు స్టేషన్లలో నమోదైన 3 కేసులను కొట్టివేయాలంటూ నల్లబాలు అలియాస్ దుర్గం శశిధర్ గౌడ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ ఎన్.తుకారాం



జీ తీర్పు వెలువరిస్తూ నల్లబాలుపై నమోదైన కేసులను కొట్టేశారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులకు సంబంధించి కేసులు నమోదు చేసే ముందు పోలీసులు, మెజిస్ట్రేట్ కోర్టులకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేశారు.

**ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు కేసుల నమోదు**

ట్వీట్లు చట్టబద్ధమైన రాజకీయ వ్యక్తీకరణ పరిధిలోకి వస్తాయని కోర్టు భావిస్తోందని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు కేసుల నమోదు విచారణ యాంత్రికంగా, ఏకపక్షంగా జరగకుండా నిరోధించే క్రమంలో ఈ మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పరువు నష్టం కలిగిందనే ఆరోపణల ఆధారంగా ఎఫ్?ఐఆర్? నమోదు చేసే ముందు ఫిర్యాదుదారు చట్ట నిబంధనల ప్రకారం 'బాధిత వ్యక్తి' అవునో కాదో పోలీసులు ధ్రువీకరించాలని హైకోర్టు మార్గదర్శకాల్లో పేర్కొంది.

**కేసులు నమోదు చేయొద్దన్న కోర్టు**

తీవ్రమైన నేరాల సమయంలో మినహా పోస్టులతో సంబంధం లేని ఇతరుల తరఫున చేసిన ఫిర్యాదులు విచారణార్హం కాదని స్పష్టం చేసింది. తీవ్రమైన నేరం అయినపుడు పోలీసులు కేసు నమోదుకు ముందు ప్రాథమిక విచారణ జరిపి, అందులో చట్టబద్ధమైన అంశాలున్నాయో లేదో నిర్ధరించాలని వెల్లడించింది. హింస, ద్వేషం, అశాంతిని ప్రేరేపించే ప్రాథమిక ఆధారాలుంటే తప్ప వీటికి సంబంధించిన కేసులు నమోదు చేయరాదని తేల్చి చెప్పింది. ఇందులో కేదార్?నాథ్? సింగ్ వర్సెస్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు శిరోధార్యమని సూచించింది. విమర్శనాత్మకమైన, కఠినమైన రాజకీయ ప్రసంగాలపై పోలీసులు యాంత్రికంగా కేసులు నమోదు చేయరాదని హైకోర్టు మార్గదర్శకాల్లో పేర్కొంది.

**అరెస్టు చేయరాదన్న హైకోర్టు**

ప్రసంగం లేదా పోస్టు హింసను ప్రేరేపించినా, శాంతి భద్రతలకు తక్షణ ముప్పు కలిగించేలా ఉన్నపుడు మాత్రమే చట్టాన్ని అమలు చేయవచ్చని కోర్టు తెలిపింది. అధికరణ 19(1) (ఎ) కింద సాధారణ రాజకీయ విమర్శలకు రాజ్యాంగ రక్షణలు కల్పించాలంది. పరువు నష్టానికి సంబంధించి పోలీసులు నేరుగా ఎఫ్?ఐఆర్? దాఖలు చేయకుండా సంబంధిత మెజిస్ట్రేట్?ను ఆశ్రయించమని సూచించాలని చెప్పింది. బీఎన్?ఎస్?ఎస్ సెక్షన్ 174(2) కింద మెజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశాల మేరకు పోలీసులు చర్య తీసుకోవాలి తప్ప, యాంత్రికంగా అరెస్టు చేయరాదని తేల్చి చెప్పింది.ప్రతి సందర్భంలోనూ అర్నేష్ కుమార్ వర్సెస్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని సూచించింది. రాజకీయ ప్రసంగం, పోస్టు లేదంటే ఇతర సున్నితమైన వ్యక్తీకరణకు సంబంధించి చట్టబద్ధంగా చర్యలుండేలా చూసుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించింది. ఇలాంటి వాటిపై ఎఫ్?ఐఆర్ నమోదు చేసే ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిప్రాయాన్ని తీసుకోవాలంది. రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదు అవసరం లేనిదని తేలితే దర్యాప్తునకు కారణాలు లేవంటూ పోలీసులు కేసును మూసివేయాలని హైకోర్టు స్పష్టం చేసింది.

# జాతీయ లోక్ అదాలత్

- సద్వినియోగం చేసుకోవాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**టీ మీడియా,సెప్టెంబర్ 11,రామగుండం ప్రతినిధి:**





రాజీమార్గం రాజమార్గమని,కక్షలు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని,రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.గురువారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు.ఈ నెల 13వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు.రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండ బుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు,కుటుంబపరమైన నిర్వాహణ కేసులు,వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ,టెలిఫోన్ రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ కేసులో, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు.రాజీ మార్గం రాజ మార్గ మని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని,డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను లను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# జైలుకెళ్తాగానీ వృద్ధ తల్లికి తిండి పెట్టను

- కసాయి కొడుక్కి జైలు శిక్ష విధించిన కోర్టు

**టి మీడియా, సెప్టెంబర్ 11, తిరువనంతపురం:**

కేరళలోని మడిక్కైలోని మలప్పచేరిలోని వడుతలకుజికి చెందిన ప్రతీష్ (46) అనే వ్యక్తిని నీలేశ్వరం పోలీసులు అరెస్టు చేశారు. కంజిరపోయిల్కు చెందిన ఎలియమ్మ జోసెఫ్ (68) తన కొడుకు తనకు భరణం చెల్లించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో కన్హంగడ్ ఆర్డీఓ కోర్టును ఆశ్రయించారు. అసలేం జరిగిందంటే..ఏడాది క్రితం ఆర్డీఓ కోర్టు ఏలియమ్మ అనే వృద్ధురాలు కొడుకు పట్టెడన్నం పెట్టడం లేదనీ కోర్టుకు వెళ్లింది. కోర్టు సీనియర్ సిటిజన్ల చట్టం కింద రక్షణ కోసం ఆమెకు నెలకు రూ.2,000 చెల్లించాలని ఆమె కొడుకు ప్రతీష్ను ఆదేశించింది. ఐదు నెలల క్రితం ఏలియమ్మ తన కుమారుడు భరణం చెల్లించడం లేదని ఆర్డీఓ కోర్టులోని మెయింటెనెన్స్ ట్రిబ్యునల్లో ఫిర్యాదు చేసింది. బకాయిలతో సహా 10 రోజుల్లోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని ట్రిబ్యునల్ ఆదేశించాలని మడిక్కై గ్రామ అధికారి ద్వారా నోటీసు పంపింది. ఆ తర్వాత రెండుసార్లు ట్రిబ్యునల్ ముందు ప్రతీష్ను హాజరు పరచినా డబ్బు చెల్లించేందుకు అతడు నిరాకరించాడు. జూలై 31లోపు ఆ మొత్తాన్ని చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కూడా ట్రిబ్యునల్ హెచ్చరించింది. ఈ మేరకు పలుమార్లు నోటీసులు జారీ చేసింది కూడా. చివరకు విచారణ సమయంలో కూడా ప్రతీష్ లెక్క చేయలేదు.దీంతో ఆర్డీఓ బిను జోసెఫ్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం మొత్తం చెల్లించే వరకు తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల రక్షణ సంక్షేమ చట్టంలోని 5(8) సెక్షన్ల కింద, %జతీూజ%లోని 144 సెక్షన్ల కింద జైలు శిక్ష విధించాలని ఆదేశించింది. దీంతో



నిందితుడు ప్రతీష్ను కన్హంగడ్ జిల్లా జైలుకు తరలించారు. ఆరు నెలల బకాయి రూ.12 వేలు మొత్తం తల్లికి చెల్లించేంత వరకు జైలులోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది. పలు దఫాలుగా విచారణలు జరిగినా, బకాయిలు చెల్లించేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ ప్రతీష్ చెల్లించడానికి తాను ఇష్టపడనని పదే పదే చెప్పడంతో మంగళవారం జరిగిన చివరి విచారణలో అతన్ని నీలేశ్వరం పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. అక్కడ కూడా డబ్బు చెల్లించడానికి తాను సిద్ధంగా లేనని ప్రకటించడంతో కోర్టు ఈ మేరకు అతనికి జైలు శిక్ష విధించింది.

# చిరుతకు రూ.6 వేలు, నెమలికి రూ.1000

- హనుమకొండ జూపార్క్లో కొత్త ధరలు
- వన్యప్రాణులను దత్తత తీసుకుంటారా..?

**టి మీడియా, సెప్టెంబర్ 11, హనుమకొండ**

: రాష్ట్రంలో హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కు తర్వాత చెప్పుకోదగినది ఏదైనా ఉంది అంటే హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జంతు ప్రదర్శన శాల. ఇంటిల్లిపాది ప్రకృతి ఒడిలో వన్య ప్రాణులను తిలకిస్తూ ఆనందంగా గడిపేందుకు విడిదిలా మారింది. రోజూ మనం చూసే సాధారణ జంతువులతో పాటు అరుదైన వన్య ప్రాణులు, క్షీరదాలు, సరిసృపాలు ఇక్కడ ఉన్నాయి.ఈ ఏడాది తీసుకొచ్చిన తెల్లపులి, అడవి దున్నలు, చిరుత, ఎలుగుబంట్లు, జింకలు, తాబేళ్లు, కొంగలు, నెమళ్లు, అడవి కోళ్లు, రామచిలుకలు, పావురాలు, లవ్ బర్డ్స్ తదితర 436 రకాల పక్షులు, జంతువులు సందర్శకులను ఆకట్టుకొంటున్నాయి. వీటి ఆహారానికి రోజుకు రూ.14,000లకు పైగా ఖర్చు చేస్తున్నారు. పలువురు జంతు ప్రేమికులు వారి అభిరుచి మేరకు వన్య ప్రాణులను ఎంచుకొని ఏడాది, ఆరు నెలలు, మూడు నెలల కాలానికి దత్తత తీసుకొంటున్నారు. మరింత మంది ముందుకు రావాలని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు.



**దత్తత తీసుకున్న మంత్రి**

కాకతీయ జూలాజికల్? పార్కులోని అడవి దున్న (బైసన్?)ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. దాని పోషణ నిమిత్తం రూ.2 లక్షలు చెల్లించారు. అలాగే కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఛైర్మన్? ఇనుగాల వెంకట్?రాం రెడ్డి నిప్పు కోడిని దత్తత తీసుకున్నారు. అందుకు రూ.60 వేలు చెల్లించారు. హనుమకొండకు చెందిన మంద రఘునాథ్? జాతీయ పక్షి దత్తతకు రూ.10 వేలు, ఆచార్య కృష్ణ తన కుమార్తె నిశిత పేర నెమలిని ఆరు మాసాల పాటు దత్తత కోసం రూ.6,000 జూపార్కు అధికారులకు చెల్లించారు.

**ఎవ్వరైనా దత్తత తీసుకోవచ్చు :**

జంతు ప్రేమికులు ఎవరైనా కాకతీయ జూపార్కులోని వన్య ప్రాణులను దత్తత తీసుకోవచ్చు. వారి ఆర్థిక స్థోమతను బట్టి ఏడాది, ఆరు నెలలు, మూడు నెలల పాటు పోషణ కోసం నిర్దేశించిన సొమ్మును చెల్లిస్తే సరిపోతుంది.

దత్తతకు చెల్లించాల్సిన డబ్బుల వివరాలు ( ఏడాది, 6, 3 నెలలకు)

పెద్ద పులి - రూ.4,00,000 - రూ.2,00,000 - రూ.1,00,000
చిరుత - రూ.22,000 - రూ.11,000 - రూ.6,000
అడవి దున్నలు - రూ.50,000 - రూ.25,000 - రూ.13,000
నిప్పుకోడి - రూ.70,000 - రూ.35,000 - రూ.18,000
నక్క - రూ.80,000 - రూ.40,000 - రూ.20,000
ఎలుగుబంటి - రూ.60,000 - రూ.30,000 - రూ.15,000
మొసలి - రూ.40,000 - రూ.20,000 - రూ.10,000
అడవి పిల్లి - రూ.36,000 - రూ.18,000 - రూ.9,000
కనుజు - రూ.16,000 - రూ.8,000 - రూ.4,000
రామ చిలుకలు - రూ.3,500 - రూ.2,000 - రూ.1,000
పావురం - రూ.3,500 - రూ.2,000 - రూ.1,000
నెమలి - రూ.3,000 - రూ.2,000 - రూ.1,000
మచ్చ జింకలు - రూ.10,000 - రూ.5,000 - రూ.2,500
మూషిక జింకలు - రూ.12,000 - రూ.6,000 - రూ.3,000
కొండ గొర్రె - రూ.10,000 - రూ.5,000 - రూ.2,500.



## ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

**టీ మీడియా సెప్టెంబర్ 11 వనపర్తి బ్యూరో :**

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ గురువారం కురిసిన భారీవర్షాలకు వరదతో ముంపుకు గురైన లోతట్టు రాజీవ్ గృహ కల్ప,ఎస్. సి,ఎస్.టి వసతి గృహాలు,జంగిడిపురం,భగీరథ కాలనీ వెంగల్ రావు కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రికుంట చెరువు అలుగు పారడం,పీర్లగుట్ట నుంచి వచ్చిన వరదలతో రాజీవ్ గృహ కల్పలో మోకాళవరకు నీళ్లు చేరడంతో ప్రజలను అప్రమత్తం చేసి మిగతా ప్రాంతాలంలో నిలిచిన నీటిని మున్సిపల్ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు.అతిభారీ వర్షాలు ఉండడం వల్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా అధికారులు కూడా లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైస్ చైర్మన్ వెంట బారసా నాయకులు నందిమల్ల సుబ్బు, వంశీ, లతీఫ్ అందాల రమణ ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో బూడిదైన ఇల్లు

**టీ మీడియా, సెప్టెంబరు 11, పెబ్బేరు: గురువారం**



పెబ్బేరు మున్సిపాలిటీ6 పరిధిలోని బీసీ కాలనీలో పటేల్ గారి మహేశ్వరి భర్త తిరుపతయ్య ఇంట్లో వాటర్ హీటర్ తో బూడిదైనా ఫ్రిడ్జ్ మిక్సర్ గ్రైండర్ బియ్యం ప్లాస్టిక్ వస్తువులు సాంకేతిక లోపంతో తెల్లవారుజామున కరెంటు పోవడం జరిగింది ఇంట్లో వాటర్ హీటర్ ఆన్ చేసి ఆఫ్ చేయటం మర్చిపోయారు ఇంట్లో వారందరూ పనిమీద బయటికి వెళ్లడం జరిగింది సుమారు 10,20 నిమిషాల సమయంలో కరెంటు రావడం జరిగింది అయితే ఆన్ లో ఉన్న హీటర్ వేడికి పక్కనే ఉన్న ఫ్రిడ్జ్ సిలిండర్ అంటుకోవడం జరిగింది పక్కనే ఉన్న మిక్సీ ప్లాస్టిక్ వస్తువులన్నీ బియ్యం అంటుకోవడం జరిగింది ఇంట్లో నుండి పొగలు రావడంతో పక్కఇంటివాళ్ళు ఫోన్ ద్వారా సమాచారం అందించారు ఇంటి వాళ్ళు వచ్చి తలుపులు తెరువగా మంట పొగతో ఇల్లంతా కమ్ముకుపోయింది పక్కనున్న వాళ్లు నీళ్లతో ఇంట్లోకి కొట్టారు పక్కనే ఉన్న బియ్యం కిరాణం అంతా నానిపోయాయి బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య

- క్యాంపస్ బిల్డింగ్ రూఫ్ నుంచి షుట్ చేశాడు

**టి మీడియా, సెప్టెంబర్ 11, న్యూయార్క్:**



ఉటా యూనివర్సిటీలో కన్జర్వేటివ్ నేత ఛార్లీ కిర్క్ను దారుణంగా హత్య చేశారు. అయితే వర్సిటీలో ఉన్న ఓ బిల్డింగ్ రూఫ్ మీద నుంచి నిందితుడు కాల్పులు జరిపినట్లు ప్రాథమికంగా పోలీసులు అనుమానిస్తున్నారు. క్యాంపస్ కోర్టుయార్డ్ సమీపంలో ఉన్న బిల్డింగ్ నుంచి ఆ కాల్పుల ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కిర్క్ మెడలోకి బుల్లెట్ దిగినట్లు తెలుస్తోంది. కాల్పులు జరిపిన వ్యక్తి కోసం గాలింపు కొనసాగుతున్నది. తొలుత ఓ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి ఆ తర్వాత వాళ్లను వదిలేశారు. టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ అనే సంస్థను కిర్క్ స్థాపించారు. షుటింగ్ ఘటనపై ఎఫ్బీఐ అధికారులు విచారణకు సహకరిస్తున్నారు.కిర్క్ హత్య పట్ల నేతలు స్పందిస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఆ కాల్పుల ఘటనను ఖండించారు. బెవర్లీహిల్స్ సెలబ్రిటీలు కూడా ఈ హత్యను ఖండించారు. అమెరికాలో ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. యువతను ఆకర్షించడంలో.. వాళ్లు తనకు ఓటు వేసేలా చేయడంలో కిర్క్ కీలక పాత్ర పోషించినట్లు ట్రంప్ అన్నారు. ఎఫ్బీఐ ప్రజలకు అభ్యర్థన చేసింది. షుటింగ్ ఘటనకు చెందిన ఫోటోలు, వీడియోలు షేర్ చేయాలని కోరింది. కన్జర్వేటివ్ నేత కిర్క్ను చూసేందుకు ఉటా వాలీ వర్సిటీకి వేల సంఖ్యలో యువత చేరుకున్నారు. అక్కడ భారీగా భద్రతను ఏర్పాటు చేయలేదు.

## బోధన్లో ఉగ్రమూలాలు

- యువకుడిని అదుపులోకి తీసుకున్న దిల్లీ పోలీసులు

**టి మీడియా, సెప్టెంబర్ 11,బోధన్**



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అనుమానిత ప్రాంతాల్లో బుధవారం దిల్లీ స్పెషల్ సెల్? పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమీపంలోని ఎడపల్లి పోలీస్? స్టేషన్?లో నాలుగు గంటల పాటు విచారణ చేసిన తర్వాత కోర్టులో ప్రవేశపెట్టి కస్టడీకి తీసుకుని తమ వెంట తీసుకెళ్లారు.ఆయుధాలు, మందు గుండు సామగ్రి తయారీ : ఈ యువకుడు నిజామాబాద్ నగరంలో బీ-ఫార్మసీ చదువుతున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా ఉగ్రవాదులకు సంబంధించిన యాప్లో ఆయుధాలు, మందు గుండు సామగ్రి తయారీ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడని పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. సదరు యువకుడి వద్ద ఎయిర్ పిస్టల్, బుల్లెట్లు సైతం స్వాధీనం చేసుకున్నారు.

**డానిష్ను విచారిస్తున్న క్రమంలో :** ఉగ్రవాద కార్యకలాపాలను నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పోలీసు బృందాలు, దిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు నిఘాను విస్తృతం చేశాయి. ఈ నేపథ్యంలో ఝార?ండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో బాంబు దాడులకు కుట్రలు చేస్తున్న డానిష్ అనే ఉగ్రవాదిని పోలీసులు ఇటీవలే అరెస్ట్ చేశారు. డానిష్ను విచారిస్తున్న క్రమంలోనే బోధన్ యువకుడి పేరు బహిర్గతమైంది. మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఝార?ండ్ రాష్ట్రాల్లో సైతం పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డానిష్ సోషల్ మీడియా ప్రత్యేక యాప్ల ద్వారా ఆయుధాల తయారీ, వినియోగం, సమకూర్చుకోవడం వంటి పనులు చేస్తుండగా, అందులో బోధన్ యువకుడు సైతం పాలుపంచుకుంటున్నట్లు ప్రత్యేక బృందాలు గుర్తించాయి. విచారణ జరిపితే ఇంకా ఎంత మంది దీనిలో ఉన్నారన్న విషయం తెలుస్తుంది.మా తమ్ముడికి సంబంధం లేదు : బోధన్ పట్టణంలో ఉగ్రవాద కదలికలు కలకలం రేపిన నేపథ్యంలో పట్టణంలోని ప్రజలు విస్మయానికి గురయ్యారు. దిల్లీ పోలీసులు వచ్చి బోధన్?కు చెందిన యువకుడిని విచారణ నిమిత్తం తీసుకుని వెళ్లగా, వారి కుటుంబ సభ్యులు మాత్రం 'మా అబ్బాయికి ఉగ్రవాదులతో సంబంధం లేదు' అని తెలిపారు. యువకుడి అన్న మాట్లాడుతూ, బుధవారం దిల్లీ పోలీసులు వచ్చిన మాట వాస్తవమే అని, వారు అడిగిన దానికి సమాధానం ఇచ్చామన్నారు. ఈ క్రమంలోనే తమ సోదరుడు ఒక వెబ్?సైట్?లో వీడియో కాల్? మాట్లాడేవాడని, అంతేగానీ ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధం లేదని వివరించాడు.32 మంది ఒకే ఇంటి నంబరుపై పాస్పోర్టు : ఉగ్ర మూలాలు ఉన్నాయనే కారణంతో బోధన్ కేంద్రంగా గతంలోనూ ఎన్ఐఏ, ఐబీ పోలీసులు పలుమార్లు తనిఖీలు చేశారు. 2021లో బంగ్లాదేశీయులు 72 మంది బోధన్ నుంచి నకిలీ అడ్రస్తో పాస్పోర్టు పొందారు. వీరిలో 32 మంది ఒకే ఇంటి నంబరుపై పాస్పోర్టు తీసుకున్నారని పోలీసు విచారణలో తేలింది. దీంతో వాటిని రద్దు చేసి నిందితులు, వారికి సహకరించిన వారిని అరెస్టు చేశారు. 2022 ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో సైతం ఓ వ్యక్తి ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. అదే ఏడాది సెప్టెంబరులో నిజామాబాద్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలోనే ఆర్మూర్కు చెందిన ఇద్దరు వ్యక్తులకు కేంద్ర దర్యాప్తు సంస్థ నోటీసులు ఇచ్చి విచారణ చేసింది.



## బోధనప్రమాణాలు మెరుగుపరచాలి

- ప్రధానోపాధ్యాయులు ఏ.శాంతన్న

**టీ మీడియా సెప్టెంబర్ 11 వనపర్తి బ్యూరో :**

గురువారం వనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దమందడిలో తెలుగు కాంప్లెక్స్ మీటింగ్ గజిటెడ్ ప్రధానోపా ధ్యాయులు .శాంతన్న అధ్యక్షతనవనపర్తి పెద్దమందడి మండలఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సమావేశమై వారి పాఠశాలల్లో తెలుగు బోధన,విద్యార్థులకు బోధించినట్టి పాఠ్యాంశాలపై, పరీక్షలపై చర్చిస్తూ ఇంకా మెరుగైన బోధనాపద్ధతులు ఉపాధ్యాయులందరూ ఆచరించి విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు పెంచాలని చర్చించడం జరిగింది,ఈ సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు బి.గిరిరాజాచారి, కె.నిరంజనయ్య, బి.వెంకటయ్య,బి.విష్ణువర్ధన్ రెడ్డి, బి.చిన్నయ్య, ఎం.సుజిత్, ఎ.వెంకటస్వామి, లక్ష్మీ,శైలజ, వెంకటరమణమ్మ సుమారు 30 మంది తెలుగు టీచర్స్ పాల్గొన్నారు.

## తెలంగాణ సెక్రటేరియట్లో ఇంటర్నెట్ బంద్

**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ :**



రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో సెక్రటేరియట్లో ఆన్లైన్ సేవలన్నీ బంద్ అయ్యాయి. ఎక్కడి ఫైళ్లు అక్కడే ఆగిపోయాయి. ఇంటర్నెట్ సేవలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో అధికార యంత్రాంగంతో పాటు విజిటర్స్ కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం ఏంటని ఆయా పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే విజిటర్స్ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు..? ఇంత పెద్ద వ్యవస్థలో ఇంటర్నెట్ సేవలు పని చేయకపోతే.. రాష్ట్రంలో పరిపాలన ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నిస్తున్నారు. రేవంత్ రెడ్డి మెడకు కేబుల్స్ కటింగ్ వ్యవహారం చుట్టుకున్న సంగతి తెలిసిందే. ఎవడు త్రవ్వుకున్న గోతిలో వాడే పడతాడు అంటే ఇదేనేమో అని నెటిజన్లు విమర్శిస్తున్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్ను కట్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది.

# నేపాల్‌లో తెలుగు ప్రజల కష్టాలు

- లగేజీ, డబ్బు పోగొట్టుకుని ఒట్టి చేతులతో
- అల్లర్ల నుంచి తప్పించుకునేందుకు పరుగులు

**టి మీడియా, సెప్టెంబర్ 11, అమరావతి బ్యూరో :**
స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహారయాత్రకు కొందరు, దైవ దర్శనాలకు మరికొందరు, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార నిమిత్తం ఇంకొందరు ఏపీ నుంచి నేపాల్ వెళ్లారు. ఆ దేశంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల కారణంగా బిక్కుబిక్కుమంటూ కాలంవెల్లదీస్తున్నారు. ఎప్పుడు ఏంజరుగుతుందో తెలియకఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా నేపాల్‌లో సాగుతున్న అల్లర్లకు ఎక్కడ ఉండాలో తెలియక తెలుగువారు రహదారుల వెంబడి పరుగులు పెట్టారు. ఆందోళనకారుల దాడులకు భయపడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొంతమంది బస్టాండ్‌లు, ఆలయాల్లో తలదాచుకున్నారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగొచ్చేలోపే తాము



ఉన్న హోటల్ కాలిపోయి పాస్‌పోర్టులు, దుస్తులు, డబ్బు, బంగారం పోగొట్టుకున్న వారూ ఉన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల వాసులు 217 మంది నేపాల్‌లో చిక్కుకున్నారు.

**హోటల్‌కు నిప్పు**

విశాఖలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తి, సూర్యప్రభ, కేవీఎస్ శ్రీదేవి, కె.సత్యనారాయణ, పద్మావతి కుటుంబాలు ఈ నెల 5న నేపాల్‌లోని ఆలయాల సందర్శనకు వెళ్లాయి. వారంతా ఒక హోటల్‌లో దిగారు. ఆలయాల్ని సందర్శించడానికి వెళ్లొచ్చేలోపు ఆందోళనకారులు ఆ హోటల్‌కు నిప్పుపెట్టారు. వారి దుస్తులు, కొంత డబ్బు, బంగారం కాలిపోయాయి. తర్వాత మరో హోటల్‌లో తలదాచుకున్నారు.కాకినాడ శ్రీనగర్‌కి చెందిన తల్లీ కుమార్తెలు బుద్దరాజు సరళ, రోజారాణి నేపాల్ యాత్రకు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో అల్లర్లు చెలరేగాయి. వీరు కాఠ్‌మాండూలోని ఓ హోటల్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. శ్రీనివాస్, కృష్ణవేణి, రాధ అనే ముగ్గురు కాకినాడ వాసులూ కాఠ్‌మాండూలో చిక్కుకుపోయారు.విశాఖకు చెందిన వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి గణపతి కాఠ్‌మాండూలో దక్షిణాసియా దేశాల సెమినార్ కోసమని వెళ్లి అక్కడ చిక్కుకుపోయారు. చుట్టూ ఎటు చూసినా మంటలే కనిపిస్తున్నాయని, అడుగు బయట పెట్టాలంటేనే భయమేస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**బస్సుపై దాడి**

నేపాల్‌లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లిన 8 మంది మంగళగిరి వాసులు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. హోటల్‌లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. బుధవారం వీరు ప్రయాణిస్తున్న బస్సుపై కొంతమంది దాడి చేయడంతో ఆందోళనకు గురయ్యారు. వీరు చూస్తుండగానే మరో 2 బస్సుల్ని ఆపి ప్రయాణికుల నుంచి నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నారు.

**యాత్రకు వెళ్లి చిక్కుకుని**

విజయనగరం జిల్లా నుంచి 61 మంది మానస సరోవర యాత్రకు, శ్రీకాకుళం జిల్లా నుంచి 17 మంది ముక్తినాథ్ యాత్రకు వెళ్లి కాఠ్‌మాండూలో చిక్కుకున్నారు. బయటకి అడుగు పెట్టలేని పరిస్థితి ఉందని, ఉన్న కొద్దిపాటి ఆహారాన్నే తలా కొంచెం సర్దుబాటు చేసుకుంటూ గడుపుతున్నామని వారు తెలిపారు.

**లోకేశ్ చొరవతో సురక్షితంగా రాక:**

తీర్థయాత్రలకు నేపాల్ వెళ్లిన కర్నూలు జిల్లా వాసులు 15 మంది సురక్షితంగా తిరిగి వచ్చారు. ప్రస్తుతం వారు బిహార్‌లో ఉన్నారు. ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కర్నూలు, ఎమ్మిగనూరు, గూడూరు ప్రాంతాలకు చెందిన వారు 17 మంది నేపాల్ వెళ్లారు. అక్కడ అల్లర్లలో చిక్కుకుపోగా మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని సురక్షితంగా వచ్చేలా చూశారు.

## భాగ్యనగరంలో దంచికొట్టిన వర్షం పలు ప్రాంతాలు జలమయం

**టీ మీడియా సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్? నగర ప్రజలను వర్షాలు వదలడం లేదు. ఇటీవల కురిసిన కుంభవృష్టి నుంచి తేరుకోకముందే బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జీహెచ్?ఎంసీ పరిధిలో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం సుమారు 2 గంటలుగా కురుస్తోంది. ఎల్బీనగర్?, వనస్థలిపురం, హయత్?నగర్?తో



పాటు అబ్దుల్లాపూర్ మెట్? తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్ సిటీ పరిసర ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది.భారీవర్షంతో ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు చేరింది. పలు కాలనీల్లో వరద నీరు రహదారులను ముంచెత్తింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ట్రాఫిక్?కు ఎక్కడికక్కడ అంతరాయం ఏర్పడింది. అటు పంజాగుట్ట, అమీర్ పేట్, మియాపూర్, కొండాపూర్?లోనూ భారీవర్షం ముంచెత్తింది.రాగల మూడు రోజుల పాటు హైదరాబాద్?లో వర్షాలు : ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వచ్చే మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రం కూడా సికింద్రాబాద్?తో పాటు బోయిన్?పల్లి, అల్వాల్, తిరుమలగిరి, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్?, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో వర్షపు జల్లులు కురిశాయి. భారీ వర్షం కారణంగా రహదారులపై నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో హైదరాబాద్? నగరం అతలాకుతలమైంది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

- గెలిచిన వారికి మంత్రి పదవి
- రేసులో ఎవరెవరు రంటే..?

**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్? నగర రాజకీయాల్లో ఈ స్థానం కీలకమైనదిగా ఉండటంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్?ఎస్ పార్టీలు తమ శక్తిసామర్థ్యాలన్నీ కూడగట్టుకుంటున్నాయి. ఇది కేవలం ఉపఎన్నిక మాత్రమే కాకుండా మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోరాటంగా తీసుకున్నాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూన్? నెలలో మృతి చెందిన విషయం తెలిసందే. దీంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అవసరం ఏర్పడింది.

**రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి రాగానే నిర్ణయం**

జూబ్లీహిల్స్ శాసనసభ ఉపఎన్నికలో గెలుపొందేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్?ఎస్?లు శక్తియుక్తులన్నీ కూడగట్టుకుంటున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు బీఆర్?ఎస్? ప్రయత్నాలు చేస్తుంటే కాంగ్రెస్ నేతలు జూబ్లీహిల్స్?లో గెలిస్తే మంత్రివర్గంలో స్థానం ఖాయమంటూ ప్రచారం చేస్తున్నారు. దీంతో సీనియర్ నేతలు, ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫహీం ఖురేషీ, నవీన్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. తాను కూడా పోటీ చేస్తానంటూ దానం నాగేందర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం పార్టీ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జి.వివేక్‌కు సమాచారం ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ సమాచారాన్ని వారు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం.గత ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్? పార్టీకి ఒక్క సీటు దక్కలేదు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో శ్రీగణేష్‌కు టిక్కెట్ ఇచ్చి గెలిపించడంతో జిల్లాలో తొలి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఆయన గుర్తింపు పొందారు. రెండో ఉప ఎన్నికలోనూ గెలవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు గెలుపు గుర్రాన్ని బరిలో నిలబెట్టాలని కసరత్తు చేస్తున్నారు. సీఎం ఢిల్లీ నుంచి రాగానే ఆశావహుల బలాబలాలు బేరీజు వేసి తుది నిర్ణయం తీసుకోనున్నారని ఆ పార్టీ నేతలు వివరించారు. అభ్యర్థుల బలాబలాలు పరిశీలించి తుది అభ్యర్థిని ప్రకటించనున్నారు. ముఖ్యంగా, కంటోన్మెంట్ ఉపఎన్నికలో విజయాన్ని సాధించిన తరువాత కాంగ్రెస్‌కి మంచి ఉత్సాహం లభించింది. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లో గెలిచి తన అసెంబ్లీ బలాన్ని పెంచుకోవాలన్న ఆలోచనలో ఉంది.

**బీఆర్ఎస్‌కు ప్రతిష్ఠాత్మకం కానున్న ఎన్నిక**

ప్రధాన ప్రతిపక్ష పార్టీ భారత రాష్ట్ర సమితికి జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రతిష్టాత్మకం కానుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో ఫలితాలు ప్రతికూలంగా వచ్చినప్పటికీ, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మాత్రం అనుకూల ఫలితాలు వచ్చాయి. మాగంటి గోపినాథ్? ఆకస్మిక మరణంతో రానున్న ఉప ఎన్నికలో అభ్యర్థిని గెలిపించుకోవడం గులాబీ పార్టీకి అత్యంత కీలకంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా కేసీఆర్ నేతృత్వంలో వంద స్థానాలు ఖాయమని నేతలు చెప్తూ వస్తున్నారు. హైదరాబాద్?లో బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని అంటున్నారు.అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని బీఆర్?ఎస్ నేత కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపే గోపీనాథ్‌కు సరైన నివాళి ఇచ్చినట్లని తెలిపారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఓటుకు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉంటే తొలగించాలని, లేనివారివి చేర్చాలని సూచించారు. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని, ఇళు కూలుస్తామని అంటారని తెలిపారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరని, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని అన్నారు.

**పలు అంశాలపై అంశాలపై దృష్టి సారిస్తున్న బీజేపీ**

బీజేపీ? కూడా జూబ్లీహిల్స్ ఉపఎన్నికను తేలికగా తీసుకోవడం లేదు. హైదరాబాద్? నగర ప్రాంతాల్లో తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఇది మంచి అవకాశంగా భావిస్తూ, పార్టీ నేతలు వ్యూహాత్మకంగా అభ్యర్థి ఎంపికపై దృష్టి సారింస్తున్నారు. ముస్లిం ఓట్లు, మధ్యతరగతి వర్గాల మద్దతు వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.మొత్తానికి ఈ ఉపఎన్నిక హైదరాబాద్? నగర రాజకీయ దృశ్యాన్ని కొత్తగా మలుపు తిప్పే అవకాశం ఉంది. కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందని, బీఆర్?ఎస్? గెలిస్తే ఆ పార్టీకి పునరుద్దరణలో భాగమవుతుందని, బీఆర్?ఎస్? గెలిస్తే భవిష్యత్తు అసెంబ్లీలో తమ స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రూప్-1 అంశంపై అప్పీల్‌కు వెళ్లాలని టీజీపీఎస్సీ నిర్ణయం

**టి మీడియా, సెప్టెంబర్ 11, హైదరాబాద్ బ్యూరో:**
గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయించాలని(రీవాల్యుయేషన్), లేదంటే పరీక్షలను రద్దు చేసి తాజాగా నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్? కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్ణయించింది. ఇవాళ జరిగిన టీజీపీఎస్సీ ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం రీవాల్యుయేషన్ చేస్తే టెక్నికల్ సమస్యలు రావొచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభిప్రాయపడింది.మరోవైపు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్‌ను జారీ చేయడంలో, పరీక్ష కేంద్రాల కేటాయింపులో పారదర్శకత లేదని సింగిల్ జడ్జి బుధవారం ఇచ్చిన తీర్పులో తప్పుబట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించినట్లుగా కనిపిస్తోందని, కమిషన్ తన సొంత నియమ, నిబంధనలను సైతం ఉల్లంఘించిందని అందులో పేర్కొన్నారు. గ్రూప్స్? పరీక్షలు రాసిన వారి సంఖ్యపై పొంతన లేని సమాధానాలు చెబుతోందని, మూల్యాంకనం కోసం చేసిన ప్రొఫెసర్ల ఎంపికలోనూ పారదర్శకత పాటించలేదని, ఫలితంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్న విషయం తెలిసిందే.

**అసలేం జరిగిందంటే**

టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు, తెలుగు మాధ్యమంలో జవాబులు రాసిన వారికి అన్యాయం జరిగిందంటూ పలువురు అభ్యర్థులు కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సుదీర్ఘ విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ఆన్సర్? పేపర్లు దిద్దిన వారిలో ఎక్కువ మందికి తెలంగాణ చరిత్రపై అవగాహన లేదని, దానివల్ల మార్కుల కేటాయింపులో అన్యాయం జరిగిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సబ్జెక్ట్ నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.డివిజన్? బెంచ్?లో అప్పీలు చేయనున్న టీజీపీఎస్సీ : ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. జనరల్? ర్యాంకింగ్స్?ను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ ఇచ్చింది. రీవాల్యుయేషన్ సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్?ను నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఎనిమిది నెలల్లోగా మళ్లీ మెయిన్స్?ను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు గతంలో ప్రకటించినటువంటి జనరల్? ర్యాంకింగ్ లిస్ట్?ను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. మెయిన్స్? అభ్యర్థుల పేపర్లను మోడరేషన్ విధానంలో రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు నిర్దేశించింది. ఈ నేపథ్యంలోనే ఇవాళ జరిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ప్రత్యేక సమావేశంలో అప్పీలుకు వెళ్లాలని నిర్ణయించింది. సింగిల్? బెంచ్? జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్? బెంచ్?లో అప్పీలు చేయాలని నిర్ణయం తీసుకుంది. మరి దీనిపై డివిజన్? బెంచ్? ఏమని తీర్పు ఇస్తుందో ఎదురుచూడాల్సిందే. ఇటీవల కోర్టు తీర్పు వెలువడిన అనంతరం కొంతమంది అభ్యర్థులు స్పందించారు. కోర్టు తీర్పు సానుకూలంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆలోచించి రీవాల్యుయేషన్? కాకుండా ఎగ్జామ్?ను నిర్వహించాలని వారు కోరుతున్నారు.



## మంత్రి లోకేశ్ చొరవ

### నేపాల్ నుంచి రాష్ట్రానికి 144 మంది

**టి మీడియా, సెప్టెంబర్ 11, అమరావతి బ్యూరో:**
నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి ఫలించింది. నేపాల్ నుంచి పలువురు యాత్రికులను సురక్షితంగా రాష్ట్రానికి తరలించారు. ఈ రోజు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానం 144 మందిని తీసుకుని నేపాల్ నుంచి ఏపీకీ చేరుకుంది.ఆ విమానం విశాఖలో 104 మందిని దించి, ఆ తర్వాత మిగిలిన 40 మందిని తిరుపతి విమానాశ్రయానికి చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న కూటమి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా విమానాశ్రయాలకు వెళ్లి రాష్ట్ర వాసులకు స్వాగతం పలకాలని మంత్రి లోకేశ్ సూచించారు. విశాఖ, తిరుపతి చేరుకున్న యాత్రికులను వారి స్వస్థలాలకు చేర్చే బాధ్యతను కూటమి ఎమ్మెల్యేలకు అప్పగించారు. వాహనాలు, ఇతర సదుపాయాలను సమకూర్చాలని మంత్రి ఆదేశించారు.సిమికోట్‌లో చిక్కుకున్న 12 మందిని ప్రత్యేక విమానంలో అధికారులు ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దు సమీపంలో ఉన్న నేపాల్ గంజ్ ఎయిర్‌పోర్ట్‌కు తరలించారు. అక్కడి నుంచి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లో లఖ్‌నవూ చేరుకోనున్నారు. లఖన్‌వూ నుంచి హైదరాబాద్‌కు విమానంలో తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్? చొరవతో నేపాల్?లోని పోఖ్రాలో చిక్కుకున్న 10 మంది తెలుగు పౌరులు ప్రత్యేక విమానంలో కాఠ్‌మాండూ బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. వారంతా కాఠ్‌మాండూ నుంచి విశాఖ బయలుదేరే ఇండిగో విమానంలో రాష్ట్రానికి చేరుకున్నారు.కాఠ్‌మండూ సమీపంలో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అధికారులతో సమన్వయం చేసి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న వారు రాష్ట్రానికి సురక్షితంగా తిరిగివచ్చి ఇళ్లకు చేరే వరకూ సంబంధిత అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించిన విషయం తెలిసిందే.నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై మంత్రి నారా లోకేశ్ రెండో రోజులు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి సహచర మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్‌తో కలిసి అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని లోకేశ్ మంత్రులను, సంబంధిత అధికారులను ఆదేశించారు.

**సీఎం అభినందనలు**

నేపాల్?లో చిక్కుకున్న తెలుగు ప్రజలను రక్షించే పని విజయవంతంగా పూర్తయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వారిని వారి కుటుంబాలతో క్షేమంగా కలిపారని తెలిసి సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సత్వర వేగవంతమైన సహాయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నారా లోకేశ్? నేతృత్వంలో అనిత, దుర్గేష్?లతో కూడిన బృందం ఆర్టీజీఎస్ కేంద్రంగా ఏపీ భవన్?ను సమన్వయం చేస్తూ చేసిన కృషిని అభినందించారు. మన ప్రజలు సురక్షితంగా తిరిగి వచ్చేలా చూడటంలో వారి అవిశ్రాంత ప్రయత్నం, సత్వర స్పందన ప్రశంసనీయమని అన్నారు.

## ఉప్పాడ తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడ్డ అలలు

- రోడ్డు ధ్వంసం - రాకపోకలు నిలిపివేత
-ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు



**టి మీడియా, సెప్టెంబర్ 11,నంద్యాల :** దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. సముద్ర మట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఇది కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఈ నెల 13న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు.కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ నుంచి కాకినాడ వరకు ఉన్న బీచ్ రోడ్డుపై కెరటాలు విధ్వంసం సృష్టించాయి. దీంతో రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. బీచ్ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరమని గుర్తించిన అధికారులు రాకపోకలు నిలిపివేశారు. పల్లిపేట ప్రాథమిక పాఠశాలలో మోకాళ్ల లోతు సముద్రపు నీరు చేరింది. ఈ నేపథ్యంలో పాఠశాలకు సెలవు ప్రకటించారు. టీడీపీ నేత వర్మ తీర ప్రాంతానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షానికి వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో గత రాత్రి భారీ వర్షం కురిసింది. విడపనకల్లు మండలంలోని ఉండబండ, పాల్తూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వజ్రకరూరు మండలంలోని వాగు ఉద్ధృతి కారణంగా పొట్టిపాడు, ఛాయాపురం మధ్య రవాణా స్తంభించింది. ఉరవకొండలో 90 మి.మీ, విడపనకల్లులో 79 మి.మీ, వజ్రకరూరులో 77 మి.మీ వర్షపాతం నమోదైంది.రాయదుర్గం నియోజకవర్గంలో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేదవతి, హగరి ఉగ్రరూపం దాల్చాయి. కనేకల్ మండలం బెనకల్ వద్ద వంక పొంగిపొర్లి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మనహాల్ మండలంలో కబ్బలి వంక నిండి, వరి పంటలు నీటమునిగాయి. రాయదుర్గం మండలం టి.వీరాపురం వద్ద విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కణేకల్ సమ్మర్ స్టోరేజ్ నుంచి రాయదుర్గానికి తాగునీటి సరఫరా ఆగిపోయింది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. పలు మండలాల్లో ఎడతెరిపి లేని వానలతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరుతోంది. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గూడూరు మండలంలో కుండపోతతో వీధుల్లో నుంచి ఇళ్లలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. గుమ్మాల వద్ద ఇసుక సంచులు వేసి ఇళ్లలోకి వచ్చిన నీటిని జనం బయటకు తోడేస్తున్నారు. జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఆదోని పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురుస్తూనే ఉంది. వర్షం కారణంగా ప్రధాన రహదారులు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో విద్యాశాఖ పాఠశాలలకు సెలవు ప్రకటించింది.

**20 గ్రామాలకు నిలిచిపోయి న వాహనాలు**

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిశాయి. కొలిమిగుండ్ల మండలం కలవటాల వద్ద భారీ వర్షానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కడప జిల్లా జమ్మలమడుగు నుంచి కొలిమిగుండ్ల వరకు వచ్చే వాహనాలు నిలిపివేశారు. కోవెలకుంట్ల సమీపంలోని కుందూ నది వర్షం నీటితో ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, పలు పాఠశాల ఆవరణలు జలమయ్యాయి.కడపలో గత రెండు రోజుల నుంచి తీవ్రమైన ఎండలతో ప్రజలు అల్లాడిపోయారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చేసుకోవడంతో కడపలో తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఏకతాటిగా భారీ స్థాయిలో వర్షం కురిసింది. నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ రైల్వే స్టేషన్ రోడ్డు పూర్తిగా నిండిపోయింది. వై జంక్షన్ రోడ్డు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. ఆర్టీసీ బస్టాండ్ లోకి నీరు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. సరైన మురుగు వ్యవస్థ లేకపోవడంతో వర్షం మీరంతా రోడ్లపైనే నిలబడ్డాయని ప్రజలు వాపోయారు.భారీ వర్షాలకు ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. తిరువూరు మండలం చౌటపల్లి - జి.కొత్తూరు మధ్య ఉన్న వెదుళ్ల వాగు పొంగింది. నిన్న సాయంత్రం ఎగువన కురిసిన వానకు వరద ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో అధికారులు రాకపోకలకు నిలిపివేశారు. గంపలగూడెం మండలం, వినగడప %-% తోటమూల గ్రామాల మధ్య కట్టలేరు వాగులో వరద ఉద్ధృతి పెరిగింది. స్థానికంగా కురిసిన వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు రావడంతో వాగులో వరద పెరిగింది. 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో గండ్లు పడి రహదారులు కొన్ని మీటర్ల మేర కోతకు గురయ్యాయి. వాగు మీదుగా రాకపోకలను అధికారుల నిలిపివేశారు.అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలంలో కుంబిడిసింగి వెళ్లే మార్గంలో రాళ్ల గెడ్డ పొంగింది. కుంబిడిసింగి సమీప గ్రామస్థులు రేషన్ బియ్యం తీసుకునేందుకు గద్దెరాయి %ణ=% డిపోకు వెళ్లారు. వాగు పొంగడంతో తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు తాడు సాయంతో వాగు దాటారు. వర్షం పడినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.